లేమిటి? ఈ పిల్ల లేమిటి? ఈ అల్ల రేమిటి? ఈ హెడ్మాస్టరేమిటి? ఈ ఫూరేమిటి?—ఇవన్నీ ప్రశ్నలే మాస్టారికి. కాని పదిహేను, పద్దెనిమిది సంవత్సరాల పిల్లలకి కాకి ఈక పాఠమేమిటని మాత్రం వారికి తట్టలేదు. బహుశా క్రొత్త ప్రణాళిక ననుసరించి వ్రాయబడిన పుస్తకం చదివి మరీ చెప్పినందువల్ల నేమో.

స్కూలు గడియారం పదకొండు కొట్టింది. మసిగట్టిన లాంతరు చేతులో పెట్టుకొని, కాలి ఆరిపోయిన చుట్టముక్క నవతల పారేస్తూ నైటువాచరు వచ్చాడు. మేస్టారి అవస్థచూచి "ఏమండీ నిద్ర పట్టలేదా?" అన్నాడు ఆప్యాయంగా. "నిద్ర సరేగాని, ఈ స్కూలు మరీ అధ్వాన్నంగా ఉందేం? పాఠం చెబితే వినేవాడే లేడు."

"యెందుకింటారండీ. భయముంటేగా? ఆడేందో ఇన్సారెన్సు అంట. అదిమాత్రం చేస్తారు. అంతే. చదవరు. అల్లరి ఆగడమూను."

"మరి పరీక్షల్లో ఫెయిల్ గారూ?"

"పరీక్షలేందండీ, చూసి రాయడమేగా! పైగా ఇన్సూరుచేస్తే అంతా పాసే."

"అది చెయ్యక పోతేనో?"

"చెయ్యకపోతే అయ్యగారూరుకుంటారా? ఫేల్ జేసెయ్యరూ!... ఓ ఎవరయ్యో! అంటూ పొలికేక పెట్టి, తూర్పు దిక్కున చప్పుడైతే గుడ్డిలాంతర పట్టుకొని ఆ వైపు వెళ్ళాడు నైటు వాచరు.

అటు వెళ్ళిన నైటువాచరు పడమర దిక్కుగా తిరిగివచ్చాడు.

"ఏమిటా చప్పుడు?"

"ఆ, ఏమీలేదండి. హెడ్మాష్టరుగారి పక్క ఆపాకలోని బల్లకేసి రుద్దుకొంది. ఆబల్ల ప్రక్కకి పడిపోయింది."

"వారిపడ్డ ఇక్కడెందుకున్నది?"

"ఆరి గొడ్లన్నీ ఇక్కడేగా! మా తాడు తెగుతోంది చాకిరీ చెయ్యలేక"

అంతటితో క్రొత్త మాష్టారేదో నిర్ణయాని కొచ్చినట్లు లేచి పక్క దులిపేసుకొన్నారు. మరునాటి ఉదయం క్రొత్త మాస్టారెక్కడా కనిపించలేదు.

క థా ని క

# ఆసలు రహస్యం ఇదీ

"సులోచన"

ఎప్పుడు సిగ్నలు చక్క వంగుతుందా, ఎప్పుడు రైలు వస్తుందా, ఎప్పుడు మామగారింటి కెళ్ళి బుల్లాణ్ణీ, పాపాయినీ, లలితనీ, అత్తయ్యనీ, మామయ్యనీ చూద్దామా - అనే ఆలోచనలో, ఆదుర్దాలో; అక్కడ ఆ కటకటాల దగ్గర, ఎలక్ట్రిక్ స్తంభం క్రింద అంతమంది జనం ఎందుకు కూడిందీ చూడలేకపోయాను గాని, విచారించలేకపోయానుగాని - మొత్తానికి ఆదృశ్యం చూశాక ఆ సంబరమేమిటో చూడాలనేది నాలో బలంగా రేకెత్తగా,-'ఏమే! సులోచనా! ఎక్కడికే అటూ, ఆ అలగా గుంపులోకి?' అని అమ్మ వెనకాల ఎన్ని మొత్తుకున్నా ఆ జనానికి పది గజాల దూరంలో వెళ్ళి నిలబడ్డాను; పదహారేళ్ళ పడుచునుగదా, రేపోమాపో గొప్పవాడి భార్యనయ్యే దానిని గదా ఆ గుంపుదగ్గర కెళ్ళి, అందరూ తనవంకే, తన సౌందర్యంవంకే చూస్తుంటే ఎంత లోకువగా వుంటుందీ-అసలీ ఆలోచన రానేలేదని కాదుగాని ఆ సంబరం చూడాలనీ, తెలుసుకోవాలనీ. ఇది హోదాకి ఏం భంగం?

చుట్టూ జనం చుట్టేసివున్నారు, అన్ని రకాలవాళ్లు వున్నారు. చుట్టా బీడీ సిగిరెట్ అమ్మేవాడి దగ్గర్నుంచీ రెండు వందల మైళ్లు ప్రయాణం చేసేవాళ్లదాకా వున్నారు. అయితే వొకటి. వీళ్ళెవరూ ఆ దృశ్యానికి సంబంధించిన విపత్కర తీరని సమస్యని పరిష్కరించటానికి

వచ్చివుండరు; ఎవరైనా విమర్శిస్తూంటే నిందిస్తూంటే, పబ్లికుగా తిడుతూంటే, చూద్దామనీ ఆనందిద్దామనీ, వీళ్లైతే తాముగూడా తిడదామనీ, తమ ఘనతని బయటపెడదామనీ. ఈ భావాలకనుగుణంగా వున్న భావాల్నిగలవాళ్ళే ఎక్కువమంది వున్నారనేదాన్ని తెల్సుకోగలందులకు ఎక్కువసేపు పట్టలేదు.

ఆ జనంమధ్యన పంధోమ్మిదేళ్ల పడుచు యీడాదిన్నర పిల్లాణ్ణెత్తుకొని నిలుచున్నది. వీళ్లంతా ఆమెకేసి వింతవింత చూపులు చూడటంతో నాకు తెలిసిపోయింది, ఆ కథేదో ఆమెమీదే ఆధారపడి వుందని.

“ఇది ఒఠ్ఠి నీతిమాలిందండీ! దొంగ...! ఏమి చేసినా పాపంలేదు!” ప్రక్కనవున్న ముప్ఫైతొమ్మిదేళ్ల వెధవాడబడుచు అంటున్నది, బిగ్గరగా-తను జెప్పేదంత పరమ సత్యమైనట్టు ఎవరో అన్నారు. ‘నల్లగా, రాచ్చిప్ప మొఖం అదీనూ, చేతులు తిప్పి గుడ్లు మిటకరించి వుపన్యాసం దంచుతున్నది.’

“అసలు సంగతేమిటి?” అప్పుడేవచ్చిన బ్రొమీసాలయ్య అడిగాడు, తను పరిష్కారం చేసేవాడిలాగ.

“ఏమని చెప్పనుబాబూ! ఇదినా కోడలు. ఇలా లేచివచ్చింది-మొగుణ్ణి వదలిపెట్టి! ఉత్త పుణ్యానికి! ఎవడో తేర మొగుడు ఆపని చేయించి వుంటాడు. బంగారంలాంటి అసలు మొగుణ్ణివదిలి-దీనికీ ఖర్మేమిటంటా? మా వూళ్లో మాకున్న గౌరవాన్నంతా యిది మట్టిపాలు కలుపుతున్నది. తలెత్తుకొని తిరిగే తాహతు లేకండా చేస్తున్నది.” కళ్లనీళ్లు గట్టిగా వత్తుకొని మళ్ళా ఆరంభించింది.

“మా వాడికి చంటివాడంటే అపరిమితమైన ప్రేమ. వాణ్ణి యిది తీసుకువచ్చింది. ఈ పనికిమాలిన... ఏం చేసేది బాబూ, వాడునన్ను పంపించాడు పిల్లవాణ్ణయినా తీసుకురమ్మని. అది ఇవ్వనంటుంది. మీరైనా చెప్పండిబాబూ! - ఇది ఎంత పరమ చండాలపుదైనా భర్త భరించాడు, పల్లెత్తుమాట అనలేదు. ఎన్నెన్ని తప్పుడుపనులు చేసినా సహించాడు. దీని కా విశ్వాసం లేకపోయింది. నిశిరాత్రికాడ పిల్లాడ్ని వేసుకొని ఎవడితోనో ఇటువచ్చింది. నేను కాళ్లావేళ్లబడి బ్రతిమాలుతున్నాను, ఇంటికి రమ్మని, గౌరవ ప్రపత్తులు నిలబెట్టమని. ససేమిరా అంటున్నది. మీరన్నా కాస్త-”వుపన్యాసం విరమించి, జనం వంక చూసింది అత్తమ్మ.

అందరూ చీడపురుగును చూసినట్టు చూసారు, ఆ పిల్లవంక!

“ఛి - ఛీ, ఈ బ్రతుకు బ్రతక్కపోతే ఎందులోనన్నాబడి చావరాదూ?” అన్నాడు యాభైయేళ్ళపైబడ్డ వ్యవహారకర్త - తనమూడో కూతురు పెళ్ళికాకముందే, స్కూలు ఫైనలు చదువుతూన్నప్పుడు గర్భం ధరిస్తే తనకూతుర్ని ఇలా అనగలిగాడా- ఆ వ్యవహారకర్త?

“మొగుణ్ణి వదలి వచ్చిన వాళ్లకి నరకం తప్పదు” గురుపాదం పట్టిన చెన్నకేశవులు అన్నాడు - తన భార్యా తను నచ్చలేదని, వేదాంత శుష్కత్వాన్ని భరించలేనని, వెళ్ళిపోతే, ఇలాగే అన్నాడు గాని, ఆ మాటకు విలువ కనపళ్లేదు.

“వెళ్లు వెళ్లు, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని మొగుడి దగ్గరకు!” అన్నాడు సావధానంగా విన్న సుబ్బారాయుడు. తనచెల్లెలు మొగుణ్ణి అమాంతంగా వదలి సూర్యనారాణమూర్తితో పట్నలో కాపరం పెడితే-పనిమాలి తను వెళ్లి ఇలాగే అన్నాడు, కాని ఆమె బయలుదేరి వచ్చిందా?

‘ఊఁ వెళ్లు అత్తవెంట! లేకపోతే పోలీసుల్ని రప్పించి నీ అంతు కనుక్కుంటాను’ అన్నాడు నారాయణపతి. తను ఒకప్పుడు తన పెద్ద కూతురు సుజాత విషయంలో ఈ పరిస్థితులలోనే ఇలాగని-ఫలితం కాకపోయేప్పటికి మెదలకండా వూరకోక తప్పలేదు.

ఇలాగే చాలామంది ఆ పిల్లమీద అధికారం చెలాయించారు. ఆమె పచ్చి వ్యభిచారిణి అన్న సంగతిని అక్కడున్న ముప్ఫైఆరుగురూ అంగీకరించారు. చెప్పొద్దూ నాకు భలే కోపం వచ్చింది. ఆ పిల్లమీద.

‘మదం దిగి - కళ్లు బైర్లుకమ్మి...’ అనిపించింది.

కాని ఆ పిల్ల దీన్నంతా అంగీకరించినదానిలా ఎదురు మాట్లాడలేదు. ఆ పరిస్థితుల్లో మరీ హెచ్చాయి, జనంయొక్క దూషణ భూషణాలు

నీచంగా తిట్టారు. అత్తమ్మ సంతోషించింది. సిగ్నలు యిచ్చారు. దూరంగా రైలు కూత కూసింది. నేను త్వరగా వెళ్ళాను అమ్మదగ్గరకు.

తరువాత ఆ పరిస్థితి ఎలా పరిణమించిందీ చెప్పలేను గాని మొన్న ఈమధ్య మా బాబాయి గారింటికి మూడో కొడుకు అన్నప్రాశనకి వెళితే అక్కడ పాచిపని చేస్తూన్నది ఆ పిల్ల.

ఆమెను చూసినక్షణంలోనే నిజం తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది. మనిషి మునుపటి తీరులో లేదు. చిక్కిపోయింది, కళ్లు లోతుకు పోయినయ్. అసలే అంత అందమైంది కాక పోవడంచాత, ఆ అందం ఇప్పుడు మరీ చెడింది.

అన్నప్రాశన అయిన మరునాడు, అంటే మేము తిరిగి రేపు వెళతా మనగా—పనంతా అయిపోయింతరువాత రాత్రి కూచోబెట్టి అడిగాను, చరిత్రంతా చెప్పమని. నాచరిత్ర విని మీరుచేసే సహాయమేమిటి అని ఆమె గనుక కొంచెం సాహసంతో అంటే నేననేది ఏమీ లేదు. సహాయంచేసేదిగూడా ఏమీ వుండ దేమో, దాదాపుగా. కాని ఆమె ఆ మాట అనలేదు. నిరాశని వ్యక్తంచేసింది కాని—నా పట్టుతో దాన్ని కాస్త వదలకొట్టాను.

'ఆనాడు నే నందరికళ్ళల్లో వ్యభిచారిణిని. మాఅత్త అన్నట్టు నీతిమాలిన దానిని—ఇలాగే అందరూ భావించారు తిట్టారు. కాని నేను ఏమని సమర్థించుకోను? ధైర్యంతో చెప్పినా నామాట ఆలకించే వారెవరుంటారు.'

'మరి మీఅత్త చెప్పిందంతా అబద్ధమేనా?'

'కాక! నేను వ్యభిచారిణిననే నమ్ముతున్నారా? అదంతా ఒకకుట్ర. అది ఆస్తి కోసంచేసిన కుట్ర. తరువాత నాకు తెలిసింది.

'భర్త దగ్గరానూ, అత్తదగ్గరానూ భయంకర నిత్యనరకం అనుభవించలేక ధేంట్లోనైనా పడదామని నే నొచ్చాను. అంతకుమించి ఏ రంకు మొగుణ్ణీ లేపుకురాలేదు. అత్త ఎంత చెపితే అంతేనాభర్త. ఆయనకు స్వంతబుద్ధిగాని, స్వంత ఆలోచనలుగాని ఏమీలేవు. నేను కాపరాని కొచ్చిన రెండో నెలనుంచీ-ఏకారణంతో పగ బట్టిందో నిర్ణయించడం కష్టం-మొత్తానికి పగ సాధించాలనే పట్టు గాఢంగా పట్టింది. ఎద్దంత జీతగాణ్ణి వెళ్ళగొట్టి రోజూ నా చేత పేడ కళ్లు తీయించేది, దొడ్డి అంతా వూడిపించేది... మళ్ళా నే నీపనంతా చేసివచ్చి అన్నంవండాలి, కూరలువండాలి. ఆమె అలా అంటుకోదు. ఏ రోజూ నేను పన్నెండు గంటలలోపు అన్నం తినకపోయినా-మొఖం కడుక్కోనే తీరుబడి లేకపోయినా నాభర్తగాని, అత్తగాని అడగ లేదు, 'ఇంత ఆలస్యంగా ఎందుకు తింటు న్నావు' అని.

'కాని మా అత్తగారి పగ దీనితో సరిపో లేదు. 'నీ పెళ్ళాం పరాయి మగవాళ్ళవంక చూస్తున్నదిరా. జాగ్రత్త!' అని కొడుక్కి ఒక నాడు ఫిర్యాదు చేసింది, నేను ఒక చెంపన వింటూ వుండగానే! నిజంగా నాకప్పుడు ఈ లోకం ఎలా కనపడాలో అలా కనపడింది. ఈ మాటలువిని న న్నా రో జు రా త్రి చావమోదారు. ఆయనగారికి కోపం రావటమే కాస్త ఆలస్యంకాని, వచ్చింతరువాత చచ్చేదీ బ్రతికేదీ ఎరగరు—ఈ నిజాన్ని ప్రతివారానికి ఒకసారో రెండుసార్లో ఎరుకపరుస్తూ వుంటారు. నా భర్తగారు ఒకరోజు బంగారు పూతపూసిన గుండీలు ఎక్కడపోయినవో, పారేసుకున్నారో మరి—ఆ గుండీలను నేను దొంగిలించి రంకు మొగుడుకు ఇచ్చానని ఆరోపణ నెరపింది, మా అత్త! అంతటితో ఎక్కడలేని కోపం వచ్చింది. జుట్టు మెలపెట్టి గోడకేసి, తలుపుకేసి కొట్టారు. నెత్తురు కారింది తలచిల్లిపడి. తరువాత చాకలిది తెచ్చియిచ్చింది, విడిచిన చొక్కాలో ఉన్నా యని. అప్పుడయినా విచారించలేదు.

''ఇటువంటి పరిస్థితుల్లో నేనక్కడ ఎలా



వుండేది?"- ఏమైనా కాకపోయినా భవిష్యత్తును గురించి ఆలోచించకుండా వచ్చేశాను. వెంటనే నా వెంట మా అత్త వచ్చింది. ఇంటివద్ద యమయాతనలు పెడుతున్నా బయట నాయందు ఎంతో ఆప్యాయంగా వుంటుంది. మా నాన్న గాని, ఎవ్వరైనా మా బంధువులు వస్తేసరి తనకు నాయందు ఎటువంటి నిష్కల్మష అపార ప్రేమ వున్నదో వ్యక్తంచేస్తుంది. అంచాత మా నాన్నకు నామీదకంటె వియ్యంకురాలిమీద, అల్లుడు గారిమీద ప్రేమ ఎక్కువ. అక్కడే వచ్చింది ఆనాడు జరిగిన కథకు మూలం. మా నాన్న చావుబ్రతుకుల్లో వున్న రెండెకరాలన్నర ఆస్తి అల్లుడుపేర వ్రాసాడు. కూతురూ అల్లుడూ అంతా ఒకటీ గదా, అని! ఆ క్షణంలోనే పారిపోయిన సంగతి మా తండ్రికి తెలీనివ్వగూడదని అత్తగారు నా వెంట వచ్చింది. కనీసం పిల్లవాణ్ణైనా ఇవ్వమన్నది, పిల్లవాణ్ణి విడచి నేనుండలేను గాబట్టి నేను గూడా రావాల్సిన అగత్యం పట్టుతుంది గాబట్టి.

"చివరకు వెళ్లాను. కొన్నాళ్లు బాగానే చూశారు. కొత్తజీతగాణ్ణి పెట్టారు. నన్నెంతో ఆప్యాయంగా చూడటం మొదలెట్టారు. కాని మొదట్లో ఈ అప్యాయత, కృత్రిమపు ప్రేమ అర్థంకాలేదు గాని నెల్లాళ్లు గడచిం తరువాత, జీతగాడు సరీగా చేయటంలేదని వెళ్ళగొట్టి నన్నా పని క్రింద నియమించినప్పుడు, పూర్వపు నరకం చూపిస్తున్నపుడు తెలిసింది- ఆ రెండెకరాలన్నరా ఆస్తికోసం అని."

"నా కొడుక్కి, ఆ చిన్న పిల్లవాడికి పెద్దవాళ్ళకు రావలసిన జ్వరం వచ్చి చనిపోయాడు. అంతటితో నేనక్కడ యింకా యెందుకుండవలసి వచ్చిందో, ఎవరికోసం వుండవలసి వచ్చిందో—తెలిసి వచ్చేటట్టు పరిస్థితుల్ని కల్పించారు. ఓరోజున నా భర్త ఇంటినుంచి వెళ్ళమన్నాడు, తల్లి ఆసరాతో.

"నువ్వు నాకు తగిన పెళ్లానివి కావు. నేనింకో పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు. నాకు తల తిరిగిపోయింది.

"జీవిత గమనాన్ని ఆలోచించకుండా ఆ యింటినుంచి వెళ్లై వచ్చేశాను. జీవించడంకోసం ఏపనైనా చేయటానికి వెనుదీయరాదన్న నిశ్చయానికి వచ్చే సమయంలో మీ బాబాయి గారింట్లో దాసీపని దొరికింది. సంతోషంతో స్వీకరించాను. కాస్తంత తిని యిక్కడే పడి వుంటాను. నాకు యిల్లా, పాడా?

"ఈ ప్రపంచంలో నీతికీ న్యాయానికీ తావు లేదని నాకు తెలుసు! ఆ రెంటిమధ్యే నా జీవితం ఈ స్థితిలోకి వచ్చింది. లోకం ఎంత నన్ను వ్యభిచారిణి అని అన్నా, నేనెన్నడూ ఆ పాడుపని చేయలేదు. కాని అనవసరంగా ఆ అపనింద వచ్చినందుకు మాత్రం దుఃఖిస్తున్నాను. మా అత్త అలాఅన్నదంటే అందులో ఎంతైనా స్వార్థం వున్నది. ఆ ముసుగుతో నన్ను తిరిగి ఇంటికి తీసుకువెళ్ళాలని, తరువాత దాని మూలంగా వెళ్ళగొట్టటానికి అవకాశం వుంటుందని."

"నామూలంగా వచ్చిన ఆస్తిని చూసైనా నాయందు దయ, కారుణ్యం కలక్కపోయింది ఆ నరులకు! ఇలా వెళ్ళగొట్టమనేనా మా నాన్న ఆస్తి యిచ్చింది, అల్లుడికి? స్వార్థంకోసం ఎన్నెన్ని మాటలైనా అంటారు, కాళ్లు పట్టుకోటానికూడా సిద్ధమౌతారు - తరువాత తాము కోరింది లభించింతరువాత ఎంతో నీచంగా చూస్తారు- ఇదే ఈలోకంలో వ్యక్తుల్లో పాతుకుపోయిన వ్యక్తిత్వం!"

ఆమెను ఆమె జీవితాన్ని నాశనం చేయటానికి సమకట్టిన వ్యక్తుల్ని- ఏంచేసినా పాపంలేదు అని తప్ప అనలేకపోయాను ఆమెతో.

కవి: (స్నేహితుడితో) ఇంతకూ చెప్పొచ్చేదేమంటే, నాలో అసలు కవిత్వం లేదని తెలుసుకుందికి పదేళ్లు పట్టింది.

స్నేహితుడు: ఇంకయితే కవిత్వం మానేస్తావా?

కవి: (విచారంగా) ఎలాగ? ఈలోపుగా నేను మహాకవినన్న సంగతి దేశం అంతా పాకిపోయిందే!